క్లుప్తంగా

ఆపదలో ఆసరాగా...



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

వీరఘట్టం: మండలంలోని నడుకూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటున్నారు. వీరఘట్టం రామాలయం పంతులు ఇటీవల మృతి చెందడంతో గురువారం అతని భార్యకు రూ.8 వేలు నగదు సాయం అందించారు. నిత్యావసర సరుకలు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

24 గంటల్లో తొమ్మిది ప్రసవాలు

సీతంపేట: సీతంపేట ఏరియా ఆస్పత్రిలో 24 గంటల్లో 9 మంది గర్భిణులు ప్రసవించినట్టు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు తొమ్మిది డెలివరీలు చేయగా వీటిలో ఎనిమిది సాధారణ ప్రసవాలు కాగా ఒకరికి సిజేరియన్ చేశామన్నారు. గైనకాలిజిస్టులు ఎ.ఉష, జె.షన్ముఖి, టి.హారీషాల పర్యవేక్షణలో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారన్నారు.

గణేష్ లడ్డూ వేలం



ఉల్లిబద్రలో వినాయక మండపం వద్ద వేలం వేసిన లడ్డూ

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిబద్ర రామాలయం వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి నివేదించిన లడ్డూకు గురువారం మండపం వద్ద వేలం నిర్వహించారు. వేలంలో గ్రామానికి చెందిన బౌరోతు సింహచలం, ఇందిర దంపతులు రూ.46,500లకు దక్కించుకున్నారు.

అన్న సమారాధన



గుమ్మలక్ష్మీపురంలో వినాయకుని మండపం వద్ద అన్న సమారాధన



వీరఘట్టం: బార్నాల వీధిలో అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు

గుమ్మలక్ష్మీపురం: వినాయక చవితి ఉత్సవాలు మండల పరిధిలోని గ్రామల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గురువారం పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక బార్నాల వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన అఖండ అన్న సంతర్పణకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఉత్సవ కమిటీ వారు భక్తులందరికీ స్వామి వారి అన్నప్రసాదాన్ని అందజేసారు. పలు వీధులలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో స్థానికులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

5కే మారథాన్ రేపు

పాలకొండ రూరల్: చదువులతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనటం వలన మానసిక ఉల్లాసం పెరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. ఈ నెల 23వ తేదీన 5కే మారథాన్ పోటీలు కళాశాలలో నిర్వహించనున్నట్లు గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను విద్యార్థులకు వివరించారు.

బత్తిలికి ఆర్టీసీ సర్వీసులు నడపాలి

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం నుండి బత్తిలి, భామినికి ఆర్టీసీ బస్సులు నడపాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఇప్పటికైనా ఆర్టీసీ సర్వీసులు నడపాలని బత్తిలి ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, సర్పంచ్ టి.శాంతికుమారి, రెల్లి సంఘ నాయకుడు బంగారి శేఖర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శ్రీకాకుళం డిపో నుండి రోజుకు 20 ఆర్టీసీలు నడుస్తూ ప్రయాణికులను తరలిస్తున్నా.. కొత్త జిల్లా కేంద్రానికి వెళ్లడానికి కనీసం ఆర్టీసీ సర్వీసులు నడపకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. దీని వల్ల ఈ ప్రాంత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సర్వీసులు వేయాలని కోరారు.

గురజాడ అనుసరణీయం

పాలకొండ రూరల్: మహాకవి గురజాడ అప్పారావు అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. గురజాడ జయంతిని కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ గొప్ప సంఘ సంస్కర్త, అభ్యుదయవాది, ఆదర్శ ప్రాయుడు అని కొనియాడారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించే క్రమంలో ఆయన రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, పలు విభాగాధిపతులు సీహెచ్ కుమారి, బి.రాజు, కె.శ్రీనివాసరావు, ఎం.శాంతి, రాఘవేంద్రనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిగువ మండలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దిగువ మండ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మహాకవి గురుజాడ అప్పారావు జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. హెచ్ఎం పి.దేవానంద్ గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహ ఉపాధ్యాయుడు సుబ్బారావు, విద్యార్థులు ఉన్నారు.

కేజీబీవీలో...

కొమరాడ: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ జి.అరుణ్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచారన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతంపేట: గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం తదితరులు



పాలకొండ రూరల్: గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఘనంగా గురజాడ జయంతి

సీతంపేట: గురజాడ అప్పారావు జయంతిని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెచ్ఎం ఎ.లిల్లీరాణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు యత్నించిన మహాకవి గురజాడ అని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీకారుడన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో పాలక అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై పోరాటం

గరుగుబిల్లి: మూఢ నమ్మకాలపై పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని బి.మాలతి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: గురజాడ చిత్రపటం వద్ద నివాళులు



గుమ్మలక్ష్మీపురం: దిగువ మండలో గురజాడ జయంతి సందర్భంగా వాల్‌పోస్టర్లు విడుదల



కొమరాడ: కేజీబీవీలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

పక్కాగా 'ఆరోగ్య సురక్ష' సర్వే

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సక్రమంగా చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజుల పాటు వైద్య సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటిని సర్వే చేయాలని తెలిపారు. గ్రామంలోని మొత్తం ప్రజల ఆరోగ్య పరిస్థితి గుర్తించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. వచ్చే నెల 6న గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అందరికీ పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్టు తెలిపారు. ఆమెతో పాటు ఈఓపీఆర్డీ సూర్యనారాయణ ఉన్నారు.

ఆరోగ్య సురక్షతో భద్రత

పాలకొండ రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి వ్యక్తిగత ఆరోగ్య భద్రత లభిస్తుందని వైద్యాధికారి తేజరత్న అన్నారు. పట్టణంలోని నీలమ్మ కాలనీలో వైద్య సిబ్బందితో కలసి ఇంటింట సర్వే గురువారం చేపట్టారు. ప్రతి ఇంట్లో నివాసిత సభ్యుల వివరాలు, వారి వ్యక్తిగత ఆరోగ్య సమస్యలపై వివరాలు నమోదు చేశారు.



పాలకొండ రూరల్: నీలమ్మకాలనీలో ఆరోగ్య సమస్యలపై వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై సూచనలిస్తున్న ఎంపీడీఓ

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఐఓ జగన్మోహనరావు

కొమరాడ: వసతిగృహంలో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను వైద్య బృందంతో కలసి గురువారం సందర్శించారు. అక్కడ విద్యార్థుల ఆరోగ్యంపై తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్య తనిఖీ వివరాలు, హిమోగ్లోబిన్, రక్త పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య డెమో యోగీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డీఐఓ

పాలకొండలో భారీ వర్షం

పాలకొండ: మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకుని వర్షం కురిసింది. ఈ వర్షంతో ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బహుమతి పొందిన కార్టూన్

గరుగుబిల్లి: నెల్లూరుకు చెందిన మామిడిపూడి రామకృష్ణయ్య స్మారక సాహిత్య సంస్థ నిర్వహించిన కార్టూన్ పోటీలలో మండలంలోని రావివలస గ్రామానికి చెందిన గుంట్రెడ్డి భాస్కరరావు (భాను)కు ప్రత్యేక బహుమతి లభించినట్లు భాను గురువారం తెలిపారు. త్వరలో నెల్లూరులో జరగనున్న శ్రీ శతాబ్ది ఉత్సవాలలో నగదు బహుమతితో పాటు, షీల్డు అందించనున్నట్లు తెలిపారు. భాస్కరరావును పలువురు సాహితీ మిత్రులు అభినందించారు.

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఆలయ ప్రధానఅర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం లక్ష్మీనృసింహ స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో మహిళలు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు.ముందుగా ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారిని వివిధ రకాల పూలు,పత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రసాదాల వితరణ జరిగింది.

సమస్యల పరిష్కారానికి వినతి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్య లు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకలు డి.సురేష్, రమేష్, కామేష్, తదితరులు జాతీ య ఎస్టీ కమిషన్ సభ్యులు అనంతనాయక్‌కు విన్న వించారు. మండలంలోని ఏకలవ్య పాఠశాల సందర్శనకు వచ్చిన ఆయనకు గురువారం వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం ఐటీడీఏలో గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలని, గిరిజన సంక్షేమ వసతిగృహాలకు గత విద్యా సంవత్సరం నుండి డైట్ బిల్లులు చెల్లించలేదని వెంటనే చెల్లించాలని కోరారు. ఆశ్రమాల్లో గతంలో పని చేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

ఈకేవైసీ చేయించుకోవాలి

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో సేద్యం చేస్తున్న పంటలకు సంబంధించి సమగ్ర సమాచారం నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ కూడా చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని పలు సచివాలయాల పరిధిలో గల ఆర్‌బీకేలను గురువారం ఆమె సందర్శించారు. పంచాయతీల వారీగా పంటల నమోదు, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతుల వివరాలపై ఆరా తీసారు. ప్రస్తుత సీజన్‌లో వరి పంట కీలక దశలో ఉన్న క్రమంలో దిగుబడి పెంపొందించుకునే మెలకువలపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహా

పోస్టర్ ఆవిష్కరణ

వీరఘట్టం: విజయవాడలో అక్టోబర్ 1 నుంచి జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను గురువారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. మండలంలో పలు పాఠశాలలను సందర్శించి ప్రచారం చేశారు. శుక్రవారం సీతంపేటలో ప్రారంభం కానున్న స్వర్ణోత్సవ ర్యాలీలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సంఘ నేతలు మజ్జి పైడిరాజు, ఎ.స్వామిబాబు, కె.గోవిందరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ బి.శివప్రసాద్ అన్నారు. పాలకొండ - వీరఘట్టం రహదారిలో తన సిబ్బందితో కలసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా అధిక లోడు, మితిమీరిన వేగం, సరైన వాహన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి అపరాధ రుసుము విధించారు. మద్యం సేవించి, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసారు.



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పశు వ్యాధులపై తస్మాత్...

జియ్యమ్మవలస: పశు వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని పశువైద్య శాఖ ఏడీఏ గణపతిరావు అన్నారు. మండలంలోని అల్లువాడ సచివాలయంలో పాడి రైతులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. పశువులకు ఎటువంటి వ్యాధులు సోకినా వెంటనే దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని ముందస్తు చర్యగా రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువులకు సంబంధించి నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పోల గోవిందరావు తదితరులున్నారు.



అల్లువాడ సచివాలయంలో మందులను పరిశీలిస్తున్న ఏడీఈ

ప్రకృతి వ్యవసాయంతో మేలు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రతినిధులు రాధామాధవ్, రాజేష్ అన్నారు. మండలంలోని తోటపల్లి, నందివానివలస గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలను వారు గురువారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరిస్తున్న విధానాలు, ఆచరించే పద్ధతులు,, ఆదాయ వ్యయాలు గురించి రైతుల నుండి ఆరా తీశారు. ఈ విధానంలో పండించిన పంటలను ఆహార పదార్థాలుగా వినియోగించుకోవడంతో పాటు, మిగిలిన ఉత్పత్తులను బహిరంగ మార్కెట్‌లో విక్రయం చేసి అదనపు ఆదాయం పొందుతున్నట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం మరింతగా పెంపొందించేందుకు అవసరమైన ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. రైతులను మరింత ప్రొత్సహించనున్నట్టు తెలిపారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పలువురు రైతులకు సేంద్రీయ ద్రావణాలను అందించారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రకాష్, హేమసుందర్, షణ్ముఖరావు, డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ద్రావణాలను అందజేస్తున్న రాష్ట్ర రైతు సాధికార సంస్థ ప్రతినిధులు

అంతటా వినాయక సందడి

వినాయక చవితి సందడి అంతటా నెలకొంది. పల్లె నుంచి పట్టణం వరకు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద పలు రకాల కార్యక్రమాలు రోజూ నిర్వహిస్తున్నారు. త్రిరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిసినా.. నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతూనే ఉన్నాయి. పలు మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా త్రిరాత్రి ఉత్సవాలు ముగిసిన చోట వినాయక అనుపోత్సవాలు గురువారం నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



గరుగుబిల్లి: ఉల్లిబద్రలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు



వీరఘట్టం : భక్తులచే పూజలందుకుంటున్న కూరాకులవీధిలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి



వీరఘట్టం: ముచ్చర్ల వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు



పాలకొండ రూరల్: ఇందిరానగర్ కాలనీలో క్రికెటర్ వస్త్రధారణలో దర్శనమిస్తున్న గణనాథుడు



పాలకొండ రూరల్: బాయిగట్టు వీధిలో భక్తుల పూజలు అందుకుంటున్న గణపతి

విశాఖ ఉక్కు పరిరక్షణకు యాత్ర

కురుపాం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో వారాంతపు సంత, విద్యా సంస్థలు, బజార్ల వద్ద సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బైక్ యాత్ర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. విశాఖ ఉక్కును విక్రయానికి మోదీ ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేస్తే సహించమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

ఆర్‌వైఎస్ఎస్ అధికారి పర్యటన

పార్వతీపురంటౌన్: మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో గల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో ఆర్‌వైఎస్ఎస్ అధికారి రాధామోహన్ గురువారం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతులతో మాట్లాడి వారు ఆచరిస్తున్న వ్యవసాయ పద్ధతులను, పంట దిగుబడుల గురించి ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్య పరిస్థితులు బాగుంటాయని, తక్కువ ఖర్చుతో పంట దిగుబడి బాగా ఉందని రైతులు అధికారులకు తెలిపారు.